సాక్షి సంగారెడ్డి

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



ఈత... కానివ్వొద్దు కడుపు కోత

వేసవి తాపం తీర్చుకునేందుకు చాలామంది స్విమ్మింగ్‌పూల్‌లలో సేద తీరుతున్నారు.

వివరాలు 8లో ▸



విలీనం అయోమయం

అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం కానున్నాయి.

వివరాలు 8లో ▸



ముప్పు తప్పించండి మహాశయా

సంగారెడ్డిలో వ్యాపారులు పెట్టిన హోర్డింగ్స్, ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి.

వివరాలు 9లో ▸

తనిఖీల తిరకాసులు!

ఓ మిల్లులో వంద టన్నులకుపైగా పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు

- తనిఖీల్లో పట్టుకుని వదిలేసిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- యాజమాన్యాన్ని తప్పించి.. ఇద్దరు హమాలీలపై కేసు..
- కేవలం 26 క్వింటాళ్ల బియ్యాన్నే చూపించిన అధికారులు
- కమిషనరేట్ స్థాయిలో రాజకీయ ఒత్తిడి
- భారీగా చేతులు మారిన ముడుపులు!



అది సంగారెడ్డి – మెదక్ సరిహద్దుల్లోని మెదక్ జిల్లా పరిధిలో ఉన్న ఓ బాయిల్డ్ రైస్ మిల్లు. ఇక్కడ పీడీఎస్ బియ్యం పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనరేట్‌కు సమాచారం అందింది. వారి ఆదేశాల మేరకు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం హుటాహుటిన ఈ మిల్లుపై దాడులు నిర్వహించింది. ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలోని అధికారుల బృందం తెల్లవారు జామున ఐదు గంటల నుంచి రాత్రి వరకు తనిఖీలు చేసింది సుమారు వంద మెట్రిక్ టన్నులకు పైగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించింది. సదరు మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిన అధికారులు.. వారిని వదిలేసి, ఆ మిల్లులో పనిచేసే ఇద్దరు హమాలీలపై మొక్కుబడి కేసులు పెట్టారు. వంద మెట్రిక్ టన్నులకు పైగా బియ్యాన్ని వదిలేసి.. హమాలీలుంటున్న రేకుల గూడులో 26 క్వింటాళ్లు మాత్రమే బియ్యం దొరికాయని రికార్డుల్లో రాసి కేసును నీరుగార్చేశారు.

–సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

నవ్వి పోదురు గానీ నాకేంటి సిగ్గు.. ..? అన్న చందంగా తయారైంది పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరు. పీడీఎస్ బియ్యంతో అక్రమదందా చేసే అక్రమార్కుల పట్ల సింహస్వప్నంలా వ్యవహరించాల్సిన ఈ విభాగం అధికారులు అదే అక్రమార్కులతో చేతులు కలిపి కేసులను నీరుగార్చడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన ఈ బియ్యాన్ని పక్కదారి పట్టించి రూ.కోట్లు గడిస్తున్నా అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన ఈ విభాగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతోంది. పైన పేర్కొన్న కేసే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

క్రిమినల్ కేసు బదులు 6ఏ కేసు...

నిబంధనల ప్రకారం వంద టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన సదరు రైసుమిల్లు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఆ మిల్లును సీజ్ చేయాలి..కానీ, ఆ మిల్లులో పనిచేస్తున్న హమాలీలపై మాత్రమే కేసు పెట్టారు. క్రిమినల్ కేసుకు బదులు పౌరసరఫరాల శాఖకు సంబంధించి సెక్షన్ 6ఏ నమోదు చేశారు. క్రిమినల్ కేసు నమోదు చేస్తే ముందుగా మిల్లును సీజ్ చేయాల్సి ఉంటుంది. కానీ, 6ఏ నమోదు చేస్తే నామమాత్రంగా జరిమాన చెల్లిస్తే సరిపోతుంది. దీంతో అధికార పార్టీ నేత ఒత్తిడితో క్రిమినల్ కేసుకు బదులుగా 6ఏ కేసుతో సరిపెట్టడం గమనార్హం.

అధికారులేమంటున్నారంటే..

ఈ కేసు విషయమై మెదక్ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి సురేందర్‌రెడ్డిని 'సాక్షి'ప్రతినిధి వివరణ కోరగా... ఈ దాడులు తాము చేయలేదన్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేశారని చెప్పారు. వారిచ్చిన సమాచారం మేరకే తాము 6ఏ సెక్షన్ నమోదు చేశామని చెప్పుకొచ్చారు. మిల్లు యాజమాన్యంపై కాకుండా, హమాలీలపై కేసు నమోదు చేయడం ఏంటనే దానిపై అధికారులు స్పందిస్తూ విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకే అలా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ దాడులు నిర్వహించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వారు కమిషనరేట్ కార్యాలయంలో సంప్రదించాలని దాటవేశారు.

ఎమ్మెల్యే తండ్రితో ఒత్తిడి చేయించి..

సదరు రైసుమిల్లుపై విజిలెన్స్ విభాగం దాడులు చేసిన వెంటనే రైసుమిల్లర్స్ అసోసియేషన్ నేత ఒకరు రంగంలోకి దిగారు. దశాబ్దాలుగా ఈ అసోసియేషన్‌లో పాతుకు పోయి..ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరే ఈ నేత స్వయంగా విజిలెన్స్ దాడులు జరుగుతున్న మిల్లుకు వెళ్లి చక్రం తిప్పాడు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే తండ్రికి ఫోన్ చేసి ఎలాగైనా ఈ కేసు నుంచి బయటపడేలా చూడాలని కోరారు. దీంతో ఆ నేత ఆ శాఖ కమిషనరేట్ స్థాయిలో రాజకీయ ఒత్తిడి తెచ్చారు. ఈ కేసు నుంచి మిల్లు యాజమాన్యాన్ని తప్పించడంలో కీలకంగా వ్యవహరించారనేది బహిరంగ రహస్యంగా మారింది. ఈ విజిలెన్స్ దాడుల్లో సుమారు 100 టన్నులకు పైగా పీడీఎస్ బియ్యం పట్టుబడితే..కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే రికార్డుల్లో పేర్కొని..అది కూడా యూపీ, బిహార్ నుంచి వచ్చిన ఇద్దరు హమాలీపై కేసు పెట్టి చేతులు కేసును పక్కదారి పూర్తిగా నీరుగార్చారు.

విందు కోసం వెళ్తుండగా...

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు మృతి
- బాచేపల్లి జాతీయ రహదారిపై ప్రమాదం




సక్రిబాయి, సుభాష్ (ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): బంధువుల ఇంటి వద్ద విందుకు హాజరయ్యేందుకు బైక్‌పై బయల్దేరిన తల్లీ కొడుకుల్ని ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వారిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం బాచేపల్లి వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాద ఘటన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా రేగోడ్ మండలం పట్టిపోలం తండాకు చెందిన తల్లీ, కొడుకులు లవ్యద్య సక్రిబాయి, సుభాష్(24)లు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కోనాపూర్ తండాలో బంధువుల ఇంటివద్ద విందుకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి వెళ్లిపోవడంతో తల్లీ కొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న కల్హేర్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని ఛిద్రమైన శరీర భాగాలను సంచులలో ప్యాక్ చేసి పంచనామా నిమిత్తం నారాయణ ఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

న్యూస్‌రీల్

నీటి సరఫరాను పరిశీలించిన కమిషనర్



ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు

జహీరాబాద్ టౌన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని వారు సమ్మెకు దిగిన నేపథ్యంలో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. కాగా, పట్టణంలోని పలు వార్డుల్లో కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు పర్యటించి నీటిసరఫరా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను కూడా ఆయన పరిశీలించారు.

వరంగల్ సభకు తరలిరండి



జహీరాబాద్ పట్టణంలో గోడపై కేసీఆర్ అని రాస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు జహీరాబాద్‌పట్టణంలో వాల్ పెయింటింగ్ వేశారు. పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఆయన పట్టణంలోని పలు కూడళ్ల వద్ద కేసీఆర్ జిందాబాద్, తదితర నినాదాలను ఎమ్మెల్యే స్వయంగా గోడలపై రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వరంగల్ సభ విజయవంతం కోసం నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాల వద్ద గోడలపై రాయిస్తున్నామన్నారు. వరంగల్ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ



కూలీలకు పంపిణీ చేస్తున్న అంబలి

నారాయణఖేడ్: వేసవి నేపథ్యంలో ప్రవాస భారతీయులు, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ సూచనతో ఉపాధి కూలీలకు అంబలిని పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు పరశురాంరెడ్డి, తుకారాం, శ్రీనివాస్ మంగళవారం ఖేడ్ మండలం చాప్టా(కె)కు వెళ్లి గ్రామశివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు అంబలిని తయారుచేసి అందించారు. అనంతరం సీతారాంతండాకు వెళ్లి తండావాసులకు అంబలిని అందించారు.

18న ఖేడ్‌లో ముస్లింల ప్రదర్శన



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం పెద్దలు

నారాయణఖేడ్: వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ ఖేడ్‌లో ఈనెల 18న నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు పట్టణ ముస్లిం పెద్దలు తాహెర్ అలీ, షబ్బీర్ సాబ్, మాజీద్, ముస్లిం యాక్షన్ కమిటీ బాధ్యులు తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం మసీదులలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం దర్గా మసీదు నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా తహసీల్ కార్యాలయం వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దార్‌కు వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ప్రదర్శనకు సంబంధించి మంగళవారం స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డికి సమాచారం ఇస్తూ వినతి పత్రాన్ని అందజేశారు.

లింగంపల్లికి 'దళితరత్న'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ దళితరత్న అవార్డు పొందారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో అందుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థి దశ నుంచి 24 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ దండోరా ఉద్యమంలో విధులు నిర్వహించినందుకు దళితరత్న అవార్డు అందించారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల కమిటీ ఈ అవార్డు ప్రదానం చేసిందన్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి కుట్ర



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

- వ్యవసాయ కార్మిక సంఘం
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నుంచి కూలీలను, పేదలను దూరం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నర్సింహులు ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ బకాయిలు వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం అనేక రకాల ఇబ్బందులు కూలీలపై మోపుతోందని 2 నెలలుగా ఉపాధిహామీ పనులు నిర్వహించిన కూలీలకు డబ్బులు ఇవ్వకపోవడం అందులో భాగమేనన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తీసుకువచ్చి ఫొటోలు తీయడం వలన కూలీలకు రోజు హాజరు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు,వాగులు, కాలువలు తవ్వకం వంటి వాటిని ఉపాధి హామీ నుంచి కేంద్రప్రభుత్వం తొలగించి చిన్నచిన్న పనులను చూపించడంతో కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు..కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లు మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు ఉపాధి హామీకి రెండు లక్షల కోట్లు కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఝరాసంగం మండలం బిడకన్య గ్రామంలో పనులు నిర్వహించి ఇంటికి వస్తున్న కూలీ మార్గమధ్యంలో మరణించిందని ఆ కూలీ కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ ఏపీడీ బాల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, సీపీఎం నాయకులు రాజయ్య, మాణిక్యం, యాదగిరి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు ఏసోబు గ్రామాల కూలీలు పాల్గొన్నారు.



సదాశివపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్,నిర్మలారెడ్డి

దళారులను నమ్మి మోసపోవద్దు

సదాశివపేట(సంగారెడ్డి): పండించిన పంటలను దళారులను నమ్మి అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి రైతులకు సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, డైరక్టర్ విఠల్ రెడ్డి, శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూవివాద రహిత జిల్లాగా మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి. చిత్రంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు సాయిబాబా, జానకిరెడ్డి, చలపతిరావు, బాలరాజు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించి, భూ వివాదాలు లేని జిల్లాగా కృషి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించినభూ చట్టం భూ భారతి వెబ్ సైట్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...భూభారతిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని రెవెన్యూ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ నెల 16న రెవెన్యూ అధికారులకు శిక్షణ, 17 నుంచి 30 వరకు మండలాల వారీగా రైతు అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారు. నియోజవర్గానికి 3,500 ఇళ్లతోపాటు 20 శాతం అదనంగా జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

మత్స్య సహకార ఎన్నికలకు ఏర్పాట్లు

జిల్లాలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 34 సంఘాలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉందన్నారు. అందులో 11 సంఘాలకు బ్యాలెట్ పద్ధతిలో, మిగిలిన 23 సంఘాలకు మూజువాణీ పద్ధతిలో అధ్యక్షులను ఎన్నుకుంటారని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేనాటికి తగిన ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈఓ జానకీరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, పీడీ హౌసింగ్ చలపతిరావు, అదనపు డీఆర్‌డీఓ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే తప్పనిసరి



సదాశివపేటలో నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలతో కరాటే మాస్టర్లు

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థులు ఆత్మ రక్షణకు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త నాయబ్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రాండ్ మాస్టర్ సాజిద్, టెక్నికల్ అడ్వైజర్ మహమూద్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బ్రూస్‌లీ కుంగ్‌ఫూ కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులకు బెల్ట్‌తోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ కరాటే మాస్టర్ షఫీ, బెల్ బహదూర్, క్లాస్ మాస్టర్లు ఆరీఫ్ హైమద్, వంశీ, ముజీబ్, శ్రీనివాస్, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు

కల్హేర్(నారాయణఖేడ్): హనుమాన్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని రాపర్తిలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు విశేషంగా అలరించాయి. ఈ కుస్తీ పోటీల్లో చుట్టు ప్రక్క గ్రామాలనుంచి వచ్చిన మల్లయోధులు బరిలో తలపడ్డారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.



కల్హేర్‌లోని కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

ఫోన్ వచ్చే.. బెంగ తీరే!



నారాయణఖేడ్‌లోని ఎస్సీ గురుకులం

గురుకులం విద్యార్థులకు ఫోన్

- 'ఫోన్ మిత్ర'తో సదుపాయం
- తల్లిదండ్రులతో మాట్లాడుకునే సౌలభ్యం కల్పించిన ప్రభుత్వం

నారాయణఖేడ్: గురుకులాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నెలకు ఒకసారి మాత్రమే తల్లిదండ్రులతో కలిసి మాట్లాడుకునే సదుపాయం ఉంది. సుదూర ప్రాంతాల్లో ఉంటూ చదువుకుంటున్న చిన్నారులు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ వారిపై బెంగ పెట్టుకుంటుంటారు. అయితే ఇక నుంచి అటువంటి ఇంటిబెంగ చిన్నారులకు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులతో నేరుగా ఫోన్ చేసి మాట్లాడే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు సంబంధించి 'ఫోన్ మిత్ర'కార్యక్రమాన్ని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచనల మేరకు ప్రతీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా 7 నుంచి 10 టెలిఫోన్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ నలుగురు విద్యార్థులకు కలిపి ఒక ఫోన్ కార్డు ఇవ్వనున్నారు. ఈ కార్డును ఉపయోగించి తల్లిదండ్రులు అనుమతించిన ఫోన్ నంబరుకు విద్యార్థులు ఉచితంగా రోజుకు ఎన్ని సార్లయినా ఫోన్‌చేసి తల్లిదండ్రులతో మాట్లాడుకోవచ్చు.

రిజిస్టరైన నంబర్లకు మాత్రమే...

విద్యార్థులకు ఇచ్చిన ఆ కార్డులో రిజిస్టర్ అయిన ఫోన్ నంబర్లకు మాత్రమే ఫోన్ చేసే అవకాశం ఉంటుంది. ఇతర నెంబర్లకు ఫోన్ చేసే అవకాశం ఉండదు. తల్లి దండ్రులతోపాటు ఒక సహాయ కేంద్రం నంబరు కూడా కల్పించనున్నారు. విద్యార్థులు తమ పాఠశాలలో ఉండే సమస్యలను గానీ, లేదా తమ తోటి విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నా, భోజనం, వసతి, అభ్యసనంకు సంబంధించిన సమస్యలు, మానసిక ఒత్తిడి గురైనప్పుడు సాంత్వన కోసం ఈ సహాయ కేంద్రం నంబరుకు ఫోన్ చేయడం ద్వారా అధికారుల దృష్టికి సమస్య తీసుకు వచ్చి తద్వారా పరిష్కరించేందుకు వీలు కలుగుతుంది. ఫోన్ మిత్ర ద్వారా ఎప్పుడంటే అప్పుడు తమ తల్లిదండ్రులతో మాట్లాడి ఇంటిమీద ఉండే బెంగ నుంచి ఉపశమనం పొంది తిరిగి తమ విద్యభ్యాస కార్యక్రమాల్లో నిమగ్నయ్యే అపూర్వ అవకాశాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్సీ గురుకులాల్లో సదుపాయం కల్పిస్తున్నారు.



గురుకులంలోని విద్యార్థులు

ప్రాజెక్టు మిత్ర కూడా...

విద్యార్థులు కొందరు వివిధ కారణాలతో క్షణికావేశానికి లోనై తమ జీవితాలను అకారణంగా ముగించి తమ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చుతున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని 'ప్రాజెక్టు మిత్ర'అనే మరో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

విద్యార్థులకు ఉపయుక్తం

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్సీ గురుకులాలు 12, బీసీ వెల్ఫేర్ గురుకులాలు 18, ఎస్టీ గురుకులాలు 10, మైనార్టీ గురుకులాలు 9 చొప్పున కొనసాగుతున్నాయి. 5వ తరగతి నుంచి 10వ తరగతి ఇంటర్ వరకు గురుకులాల్లో బోధన జరుగుతుంది. ఒక్కో గురుకులంలో సరాసరి 400 నుంచి 500వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

నెలకు ఒకమారే..

ప్రస్తుతం గురుకులాల్లో ఉన్న నిబంధనల ప్రకారం ప్రతీ నెల రెండో శనివారం మాత్రమే తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్న గురుకులాలనికి వెళ్లి నేరుగా మాట్లాడే అవకాశం ఉంది. ఎప్పుడంటే అప్పుడు ఫోన్ చేసి మాట్లాడటం, కలిసేందుకు అవకాశం లేదు. భోజనం, వసతితో కలిపి గురుకులంలోనే ఉండటంతో పిల్లలను బయటకు వదలరు. దీంతో వారు న్యూనతాభావానికి గురవుతారు. ఇలా ఫోన్ మిత్ర ద్వారా తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాట్లాడితే విద్యార్థులకు ఇంటిపై ఉండే బెంగ తీరనుంది. తద్వారా చదువుపై మరింతగా దృష్టి సారించగలుగుతారు. ఈ సదుపాయం మిగతా అన్ని గురుకులాల్లోనూ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్సీ గురుకులంలోనే ఫోన్ మిత్ర సదుపాయం కల్పిస్తున్న ప్రభుత్వం దశల వారీగా మిగతా గురుకులాల్లోనూ కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇదే జరిగితే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది.

క్లుప్తంగా

క్లాత్ ప్యాడ్‌లనే వాడాలి

డీపీవో దేవకీ దేవి



మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

కోహెడరూరల్(హుస్నాబాద్): మహిళలు క్లాత్ ప్యాడ్‌లనే వాడాలని డీపీవో దేవకీ దేవి అన్నారు. మండలంలోని తీగలకుంటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు, యువతులకు మెన్ స్టువల్ కప్, క్లాత్ ప్యాడ్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. రుతుస్రావం అనేది అనారోగ్యం కాదని, సృష్టికి మూలం అన్నారు. మహిళలు సహజంగా ఎదుర్కొంటున్న సమస్య పీరియడ్స్ అని, అలాంటి పీరియడ్స్‌పై బహిరంగ చర్చ జరగడం మహిళల అభ్యుదయానికి ప్రతీక అని అన్నారు. రుతుస్రావం సమయంలో శానిటరీ ప్యాడ్స్ వాడటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రుతుస్రావం సంబంధమైన అలవాట్లను మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ అమీనా, తీగల కుంటపల్లి ప్రత్యేక అధికారి కవిత, పంచాయతీ కార్యదర్శి నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు

టిప్పర్ సీజ్, ఇద్దరిపై కేసు

మునిపల్లి(అందోల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ని బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ సీజ్ చేశారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కంకోల్ శివారు 65వ నంబర్ జాతీయ రహదారి టోల్ గేట్ సమీపంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుక టిప్పర్ పట్టుకున్నాం. టిప్పర్ ఇస్మాయిల్ ఖాన్‌పేట నుంచి బీదర్ వెళ్తున్నట్లు గుర్తించి బుదేరా పోలీస్ స్టేషన్‌కు తరలించాం. టిప్పర్ యజమాని ప్రవీణ్, డ్రైవర్ అంకుష్ నవండేలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): మహిళను అత్యాచారం చేసి, ఆపై బంగారు నగలను ఎత్తుకెళ్లిన కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం జోగిపేట సీఐ అనిల్‌కుమార్ వెల్లడించారు. వట్‌పల్లి మండలంలోని పల్వట్ల గ్రామానికి చెందిన ఓ మహిళ 10న జోగిపేటకు వెళ్లగా మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామానికి చెందిన పోతుల నరేశ్ రెడ్డి ఆమెకు ఫోన్ చేశాడు. ఆమె బట్టల షాపు వద్ద ఉందని తెలుకొని వెళ్లి బైక్‌పై బలవంతంగా ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం స్వగ్రామంలో వదిలిపెడుతానని బైక్‌పై ఎక్కించుకొని నాగులపల్లి గ్రామ శివారులోకి రాగానే వాహనాన్ని నిలిపాడు. తన వద్ద ఉన్న కత్తితో ఆమెను బెదిరించి బంగారం ఎత్తుకెళ్లాడు. బాధిత మహిళ 11న వట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం నిందితుడిని అదుపులోకి విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద రెండు తులాల పుస్తెల తాడు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో మరో నిందితుడు

నర్సాపూర్: చోరీ కేసులో నిందితుడిని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు. ఆయన కథనం మేరకు.. నర్సాపూర్ బస్టాండ్ సమీపంలోని శేఖర్‌కు చెందిన అయోధ్య మొబైల్ దుకాణంలో 11న రాత్రి చోరీ జరిగింది. యజమాని శేకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన దుకాణంలో సేకరించిన ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా కొడిపల్లి మండలానికి చెందిన శరత్‌కుమార్ చోరీ చేసినట్లు గుర్తించారు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హుస్నాబాద్‌లో నీటి కొలనులో జంప్ చేస్తున్న యువకులు





సంగారెడ్డి స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న జనం

ఈత.. కావొద్దు కడుపుకోత



తాడుతో ఈత నేర్చుకుంటున్న యువకుడు



నాచగిరి వద్ద భద్రత కొరవడిన హరిద్ర చెక్‌డ్యాం

- వేసవి నేపథ్యంలో ఈతకు వెళ్తున్న యువకులు, చిన్నారులు
- నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు

దుబ్బాక/హుస్నాబాద్/వర్గల్(గజ్వేల్): ఓ వైపు భగ భగ మండే ఎండలు, మరో వైపు అధిక ఉష్ణోగ్రత తీవ్రతను తట్టుకోలేక నీటి కొలనులో ఈత కొడుతూ సందడి చేస్తున్నారు యువకులు. ఒక్క పూట బడి కావడంతో విద్యార్థులు మధ్యాహ్నం అయ్యిందంటే చాటు బావులు, చెరువులు, చెక్ డ్యాంల వద్దకు ఈతకు వెళ్తున్నారు. చిన్న వయస్సులోనే తమ పిల్లలకు ఈత నేర్పించేందుకు తల్లిదండ్రులు సైతం ఆసక్తి చూపుతున్నారు. దగ్గరుండి మరీ స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు. హుస్నాబాద్ మండలంలోని మాలపల్లె శివారులో ఉన్న క్రషర్ నీటి కొలను, దుబ్బాక పట్టణంలో చెల్లాపూర్-మల్లాయపల్లి ప్రధాన కాల్వలో పిల్లలకు ఈత నేర్పిస్తున్నారు. అలాగే, జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్ వెనుకాల ఉన్న స్విమ్మింగ్ పూల్ సందడిగా మారుతోంది. ప్రతి రోజూ సుమారు 100కుపైగా యువత స్విమ్ చేస్తూ సేద తీరుతున్నారు. అయితే, కొన్ని సందర్భాల్లో ఈత విహారం విషాదాన్ని నింపుతుంది. వినోదాన్ని పంచిన ఆ నీరే చీకట్లోకి నెట్టేస్తుంది. ఆ నీటిపైనే విగత జీవులుగా తేలియాడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ఈత కొట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.



మల్లన్నసాగర్ కాల్వలో ఈత కొడుతున్న పిల్లలు, పెద్దలు



స్విమ్మింగ్ పూల్ లో డైవ్ చేస్తున్న వ్యక్తి



నడుముకి ట్యూబ్ వేసుకొని నేర్చుకుంటూ..



చేతులకు ట్యూబ్ చేసుకొని..

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

భార్య కళ్లెదుటే భర్త మృతి

బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ పై వెళ్తున్న దంపతులను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధి దొంతి గ్రామ శివారులో తూప్రాన్- నర్సాపూర్ హైవే పై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన సీతాల వెంకటేశ్(42), భార్య సుమలత ఇద్దరూ కలిసి బైక్‌పై తూప్రాన్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు బయలుదేరారు. దొంతి గ్రామ శివారులోకి రాగానే గజ్వేల్ నుంచి సంగారెడ్డి వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుమలతకు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. వెంకటేశ్ హెల్మెట్ ధరించినప్పటికీ క్లిప్ పెట్టుకోకపోవడంతో తీవ్ర గాయాలై చనిపోయినట్లు భావిస్తున్నారు. భర్త కళ్లముందే చనిపోవడంతో భార్య సుమలతకు గాయాలైనప్పటికీ రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది.



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న సుమలత

స్పందించి.. శుభ్రం చేయించి

ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో గదులు, పరిసరాలు, టాయిలెట్స్ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో గదులు, టాయిలెట్స్, పరిసరాలను అధికారులు శుభ్రం చేయించారు. హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విధితమే. మంగళవారం హాస్టల్‌లోని పరిస్థితులపై 'సాక్షి' దినపత్రికలో 'వసతి.. ఇదీ దుస్థితి' అంటూ ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రం చేయించారు. ఏఎస్‌డబ్ల్యూఓ పద్మజ హాస్టల్‌కు వచ్చి పరిశీలించారు. నర్సాపూర్ హాస్టల్ నుంచి వర్కర్లను తీసుకొచ్చారు. స్థానిక ఎస్టీ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జయరాజ్, ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ వార్డెన్ నర్సమ్మ, గ్రామ పంచాయతీ కార్మికులు ఎనిమిది మంది కలిసి హాస్టల్ గదులు, వంటగది, పరిసరాలు, టాయిలెట్స్ శుభ్రం చేశారు. చెత్తను తొలగించి పాడైన బెడ్స్ ఇతర చెత్తను జీపీ ట్రాక్టర్‌లో తరలించారు. టాయిలెట్స్ శుభ్రం చేసి బ్లీచింగ్ చేశారు.



హాస్టల్‌లో గదులను శుభ్రం చేస్తున్న జీపీ వర్కర్లు

అంబేడ్కర్ జయంతికి వెళ్లొస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంగారెడ్డి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పుల్‌కల్ మండల పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతి కుమార్ కథనం మేరకు.. మెదక్ జిల్లా శంకరంపేట్ మండలం రామోజీపల్లి గ్రామానికి చెందిన దంతేల బాలయ్య (39) వృత్తి రీత్యా డ్రైవర్. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్నాడు. అనంతరం తన తమ్ముడు అయిన దంతేల సాయి కుమార్‌తో కలిసి తిరిగి బైక్‌పై వెళ్తున్నాడు. పుల్‌కల్ మండల పరిధిలోని శివ్వంపేట బీర్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృడుడి భార్య రేవంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి వ్యక్తి



గోపాల్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలం కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాకు చెందిన లునావత్ గోపాల్(39) మహిళ వేశంలో అడుక్కుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. రోజు మాదిరిగానే 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తండా చెరువు వైపు స్థానికులు వెళ్లగా గోపాల్ చెరువులో మృతదేహమై కనిపించాడు. స్నానం కోసం వెళ్లి చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(లక్ష్మాపూర్) గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(బ్రాహ్మణ బంజేరుపల్లి)కి చెందిన మద్దురి సాయిలు(50) మంజుల దంపతులు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన సాయిలు కుటుంబ పోషణ, ఇంటి నిర్మాణానికి అప్పులు అయ్యాయని మదనపడేవాడు. 12న పనికి వెళ్లకుండా మద్యం తాగి ఇంట్లో పడుకున్నాడు. రాత్రి భార్య భోజనానికి పిలిచినప్పటికీ రాకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. చుట్టు పక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం సంగాపూర్ నుంచి లక్ష్మాపూర్ వెళ్లే కదుల్లకుంట చెరువుకట్ట వద్ద ఓ బావి బొందలో సాయిలు మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. నా భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృత్యుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి వివాహిత

చిలప్‌చెడ్(నర్సాపూర్): వివాహిత అదృశ్యమైన ఘటన చిలప్‌చెడ్ మండలం రహీంగూడ తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడ తండాకు చెందిన దేవ్‌సోత్ సరోజ, భర్త నామ్యాతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ప్రభు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తున్కిఖాల్సా వృద్ధుడు

వర్గల్(గజ్వేల్): వృద్ధుడు అదృశ్యమైన ఘటన వర్గల్ మండలం తున్కిఖాల్సా గ్రామంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. తునిఖాల్సాకు చెందిన సందల నారాయణ(85) భార్య మృతి చెందగా ఒంటరిగా ఉంటున్నాడు. కుమారులు జీవనోపాధి నిమిత్తం ముంబైలో ఉంటున్నారు. 9 నుంచి నారాయణ కన్పించడం లేదని, ఇంటికి తాళం వేసి ఉందని ఇరుగు పొరుగు కుమారులకు సమాచారమిచ్చారు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుండటంతో మంగళవారం కుమారుడు సత్యనారాయణ గ్రామానికి వచ్చి గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ పరిశీలన



అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదామును పరిశీలిస్తున్న ఏసీపీ మధు, పోలీసులు

- గోదాంలో నిప్పంటుకున్న తీరుపై ఏసీపీ విచారణ
- ఘటన కారణమైన బాధ్యుడిపై కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని మర్పడ్గ గ్రామ శివారులో గల అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదాముకు నిప్పంటుకొని నష్టం జరిగిన తీరును మంగళవారం సిద్దిపేట ఏసీపీ మధు పరిశీలించారు. ప్రమాదవశాత్తు అరటి పండ్ల గోదాముకు నిప్పంటుకొని దగ్ధమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదాముకు ఆనుకొని చీకోటి మల్లికార్జున్‌కు చెందిన 30 గుంటల భూమిని గిరాయిపల్లి రాజయ్య అనే రైతు కౌలుకు తీసుకొని వ్యవసాయాధారిత పంటలను సాగు చేస్తున్నాడు. ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనుల సాగు కోసం భూమిలో ఉన్న పత్తి పొరకకు నిప్పంటించారు. ఎండలు విపరీతంగా ఉండటంతో పత్తి పొరక కాలుతూ కోల్డ్ స్టోరేజీ గోదాంలోకి మంటలు వ్యాపించాయి. కోల్డ్ స్టోరేజీలో ఉన్న విలువైన ఏసీ మిషన్లు, అరటి పండ్ల ఆకులు చెత్తా చెదారానికి అంటుకున్నాయి. గోదాం పక్కన ఉన్న వ్యవసాయ భూమిని, పత్తి పొరకను అంటించిన తీరును ఏసీపీ పరిశీలించారు. బతుకు దెరువు కోసం సిద్దిపేటలో ఉన్న విలువైన భూమిని అమ్ముకోవడంతోపాటు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి రూ.2 కోట్లతో అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదామును ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం రోజే సుమారు రూ. 12 లక్షల విలువ చేసే అరటి కాయలను కొనుగోలు చేసుకొని గోదాముకు తీసుకొచ్చామని చెప్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 కోట్ల నష్టం జరిగిందంటూ నిర్వాహకులు కన్నీరు పెట్టారు. వారి ఫిర్యాదు మేరకు ఘటనకు కారణమైన కౌలు రైతు గిరాయిపల్లి రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ పేర్కొన్నారు.

విలీనం.. అయోమయం

అక్కన్నపేట మండలంలోని కొన్ని గ్రామాలు హుస్నాబాద్‌లోకి..

- గతంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- వీటితోపాటు మరికొన్ని గ్రామాలను చేర్చడంపై కాంగ్రెస్ చర్చ
- మండల భవిష్యత్‌పై ప్రజల ఆందోళన
- గౌరవెల్లి, జనగామ గ్రామాలు అలాగే ఉంచాలని పట్టు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉగాది పర్వదినం నాడు మంత్రి పొన్నం ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో పది రోజుల్లో అక్కన్నపేట మండలంలోని గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం కాబోతున్నాయని, ప్రక్రియ వేగంగా జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం మండలంలో ఏ నలుగురు కలిసినా విలీనం అంశంపై జోరుగా చర్చ కొనసాగుతోంది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గౌరవెల్లి, జనగామ, రేగొండ, కేశవాపూర్ రెవెన్యూ గ్రామాలతోపాటు వీటి పరిధిలోని సుమారు గుబ్బడి, మంచినీళ్ల తండా, బొడిగెపల్లి, చౌటపెల్లి, గోవర్ధనగిరి, మల్‌చెర్వుతండా, గుడాటిపల్లి గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం కానున్నట్లు ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. గతంలో విడుదలైన గెజిట్ నోటిఫికేషన్‌లో వచ్చిన గ్రామాలను కాకుండా ధర్మారం, పోతారం(జే), నందారం, కపూర్‌నాయక్ తండా, మసిరెడ్డితండా, మల్‌చెర్వుతండా, రేగొండ, గోవర్ధనగిరి, బొడిగెపల్లి గ్రామాలని హుస్నాబాద్‌లో విలీనం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కొంతమంది నాయకులు విన్నవించారు.



అక్కన్నపేట మండలం వ్యూ

ప్రజల అభిప్రాయాల మేరకు..

గ్రామాల విలీనం అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలను నిర్వహించాలన్న వాదనలు ప్రజల నుంచి గట్టిగానే వినిపిస్తున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా గ్రామాల విలీనం ప్రక్రియ చేపడితే ప్రజల్లో అసహనం పెరిగిపోతుందన్న అభిప్రాయాలను అధికార పార్టీ నాయకులే చెప్పడం గమనార్హం. ఏది ఏమైనా గ్రామాల విలీనంపై కొనసాగుతున్న అయోమయంపై స్పష్టత వచ్చేదెన్నడో వేచి చూడాలి మరీ.

గౌరవెల్లి, జనగామ గ్రామాలపై పట్టు..

గౌరవెల్లి, జనగామ గ్రామాలను అక్కన్నపేట మండలంలోనే ఉంచాలని, లేకపోతే అక్కన్నపేట మండలాన్ని పూర్తిగా ఎత్తివేయాలని కొంతమంది అధికార పార్టీ నాయకులు మంత్రి పొన్నం ఎదుట వాదించినట్లు సమాచారం. హుస్నాబాద్‌లో గ్రామాల విలీనం అంశంలో అధికార పార్టీ నాయకుల్లో సగానికిపైగా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. దూరభారం, రోడ్డు సౌకర్యాలు కలిగి ఉన్న గ్రామాలను విలీనం చేస్తే అక్కన్నపేట మండల భవిష్యత్ ఏమిటంటూ అటు ప్రజలు, ఇటు అధికార పార్టీ నాయకులే ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో విడుదలైన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం గ్రామాలను విలీనం చేస్తారా? లేక కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ప్రతిపాదించిన గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తారా...అనే అయోమయంలో ప్రజలు, అధికారులు ఎదురుచూస్తున్నారు.

విలీనం చేయొద్దని చెప్పాం



గౌరవెల్లి, జనగామ గ్రామాలను ఎట్టి పరిస్థితుల్లో హుస్నాబాద్‌లో విలీనం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించాం. ఈ గ్రామాలను విలీనం చేస్తే అక్కన్నపేట మండలాన్ని కూడా పూర్తిగా ఎత్తి వేయాలని సూచించాం. ముఖ్యమైన గ్రామాలను అక్కన్నపేట మండలం నుంచి తీసి వేస్తే మండలానికి భవిష్యత్ ఉండదు. త్వరలో మండల పరిషత్ భవన నిర్మాణం కోసం మంత్రి శంకుస్థాపన చేయబోతున్నారు.

– జంగపల్లి అయిలయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, అక్కన్నపేట మండలం